క్లుప్తంగా

ప్రమాదకరంగా షవర్ పైప్



గురజాడ జంక్షన్ సిగ్నల్ పాయింట్ వద్ద వేలాడుతున్న షవర్ పైపు (రెడ్ సర్కిల్‌లో)

అల్లిపురం: ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గురజాడ విగ్రహం దరి సిగ్నల్ జంక్షన్‌లో షవర్ పైపు ప్రమాదకరంగా మారింది. గత వేసవిలో ఎండ తీవ్రత నుంచి వాహన చోదకులకు చల్లదనం కోసం షవర్ ద్వారా నీటిని చిమ్మే ఏర్పాటును జీవీఎంసీ చేపట్టింది. ఆ పైపు ఇటీవల కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా మారింది. వచ్చే పోయే వాహనాలకు అది తగులుతూ ఎప్పుడు పడిపోతుందో అని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే దానిని తొలగించాలని వారు కోరుతున్నారు.

చురుగ్గా కాలువ నిర్మాణం



గోవింద్ రోడ్డులో కాలువ నిర్మాణం చేపడుతున్న దృశ్యం

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డులో కాలువ నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. వారం రోజులుగా పాత కాలువలను పూర్తిగా తొలగింపు కార్యక్రమం చేపట్టారు. శిథిల కాలువలు తొలగించిన తర్వాత యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతున్నట్లు జీవీఎంసీ సిబ్బంది తెలిపారు. కాలువ పనుల వల్ల గోవింద్ రోడ్డులో ట్రాఫిక్‌కు ఇబ్బంది ఏర్పడుతుందని స్థానికులు వాపోతున్నారు. వీలైనంత త్వరగా పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

ప్రజలపై ఆర్థిక భారం తగ్గించాలని నిరసన



రైతుబజారు వద్ద నిరశన తెలుపుతున్న సీపీఐ నాయకులు

సీతమ్మధార : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా పెంచిన ధరలు వెంటనే తగ్గించాలని సీపీఐ నాయకుడు జి.వామనమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం సీతమ్మధార రైతుబజారు వద్ద నిరసన తెలిపారు. ప్రభుత్వం పెంచిన ధరలు తగ్గించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వామనమూర్తి మాట్లాడుతూ విద్యుత్, వంట నూనె, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత వంద రోజుల్లో డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చినా తగ్గించలేదన్నారు. ప్రజలపై ఆర్థిక భారం మోపుతున్నారని మండిపడ్డారు. భారీగా పెంచిన బియ్యం, పప్పులు, కూరగాయలు, డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ ధరలు తగ్గించి ప్రజలందరికీ ఆహార భద్రత కల్పించాలని కోరారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో విద్యుత్‌పై రూ.8 వేల కోట్లు ప్రజలపై భారం మోపిందని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. పడాల గోవింద్, రావికృష్ణ, ఎస్.మధురెడ్డి, శివ, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..!

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డు పితాపురం కాలనీలోని రహదారులపై ఎక్కడ చూసినా వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యంతో ఈ పరిస్థితి ఏర్పడింది. రోడ్డు మీద పేరుకుపోయిన చెత్తతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసనతో సతమతమవుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగ్గా ఉండేలా ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

కల నెరవేరేనా?



భూగర్భ డ్రైనేజీ పనులు మొదలుపెట్టని బంగారుమెట్ట జంక్షన్



బంగారుమెట్ట జీవీఎంసీ స్కూల్ రోడ్డు



కుమ్మరవీధిలో నిరుపయోగంగా మారిన మ్యాన్ హోల్

- భూగర్భ డ్రైనేజీ పూర్తి చేయాలని అల్లిపురం వాసుల వినతి
- 2009లో నిలిచిపోయిన పనులు
- నేటికీ పూర్తికాని వైనం
- పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా మారని పరిస్థితి
- ఆవేదనలో స్థానికులు

అల్లిపురం: భూగర్భ డ్రైనేజీ పనులు నగరమంతా పూర్తయినా అల్లిపురంలోని బంగారుమెట్ట, వివేకానందకాలనీ, నీలమ్మ వేపచెట్టు రోడ్డు, కుమ్మరవీధి, అల్లిపురం మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో మాత్రం పూర్తి కాలేదు. దీంతో భూగర్భ డ్రైనేజీ పనులు కలగానే మిగిలిపోయినట్లు స్థానికులు వాపోతున్నారు. అధికారులకు వినతిపత్రాలు ఇచ్చిన వారికి త్వరలోనే టెండర్లు పిలుస్తామని చెబుతున్నారు. కానీ అది ఎప్పటికి జరిగేను అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వాలు మారినా..

2009 నుంచి ప్రభుత్వాలు మారినా పనులు పునః ప్రారంభించక పోవటంతో అల్లిపురం వాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నగరంలో దాదాపు అన్ని ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తయినప్పటికీ అల్లిపురంలో కొన్ని ప్రాంతాల్లో నేటికీ పనులు చేపట్టకపోవడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా భూగర్భ విద్యుత్ పనులు చేపట్టి, పనులు పూర్తి కూడా చేశారు. వాటికి లేని అడ్డంకి భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి ఎందుకు వస్తుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా భూగర్భ డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులు ఎప్పటికి పూర్తయ్యేను అని బంగారుమెట్ట వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు స్థానికులు, వార్డు మాజీ కార్పొరేటర్ పచ్చిరిపల్లి లక్ష్మి పనులు ప్రారంభించాలని వినతిపత్రాలు ఇచ్చినా కనీస స్పందన శూన్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2009లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో అల్లిపురంలో భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభించారు. అల్లిపురంలోని పలు ప్రాంతాల్లో పనులు పూర్తయ్యాయి. డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి అకాల మరణం చెందడంతో బంగారుమెట్ట, వివేకానందకాలనీ, నీలమ్మ వేపచెట్టు రోడ్డు, కుమ్మరవీధి, అల్లిపురం మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. తర్వాత పనుల సమయంలో రాళ్లు అడ్డు రావటంతో పనులు నిలిపేసి రోడ్లు వేసేశారు.

వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదు..



బంగారుమెట్టతో పాటు కుమ్మరవీధి తదితర ప్రాంతాల్లో నిలిచిపోయిన భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టి పూర్తి చేయాలి అని పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా పనులు మొదలు పెట్టలేదు. కాంట్రాక్టర్‌ను పిలుస్తున్నాం.. ప్రారంభిస్తున్నామని చెప్పటమే తప్ప ఆచరణలో జరగలేదు. తక్షణమే పనులు చేపట్టి మా ప్రాంత వాసులకు భూగర్భ డ్రైనేజీ అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నాం.

– మద్దాల వెంకట అప్పారావు, కుమ్మరవీధి

మ్యాన్ హోల్స్ ఉన్నా నిరుపయోగం..



బంగారుమెట్ట, కుమ్మరవీధి ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ పనులు కొంత మేర పూర్తయ్యాయి. అల్లిపురం మెయిన్‌రోడ్డులో పనులు మొదలు పెట్టలేదు. అందువల్ల వీటి కనెక్షన్లు ఇవ్వడం మానేశారు. నగరమంతా భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తయినా అల్లిపురం, బంగారుమెట్ట, కుమ్మరవీధి ప్రాంతాల్లో మాత్రం పనులు పూర్తి కాలేదు. తక్షణమే పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి.

– శెట్టి రాజు, బంగారుమెట్ట

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత అలవరచుకోవాలి



దుర్గమ్మకు పూజలు చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవరచుకోవాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ పేర్కొన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 39వ వార్డు చిలకపేట, లక్ష్మీ టాకీస్ యువకులు, మహిళలు ఏర్పాటు చేసిన మహాన్నదాన కార్యక్రమంలో వాసుపల్లి పాల్గొన్నారు. ముందుగా దుర్గమ్మకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం నిర్వహించిన అన్నప్రసాద కార్యక్రమాన్ని వాసుపల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భగవంతునికి భక్తులు సేవ చేయడం ఆత్మ సంతృప్తి ఇస్తుందన్నారు. నిర్వాహకులు దుర్గమ్మ నవరాత్రులు ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారన్నారు. తన వంతు సాయంగా ఈ అన్నదానానికి రూ.15 వేలు అందజేసినట్లు తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా కావాలని, అమ్మవారి కృపతో రామరాజ్యం వస్తుందని వాసుపల్లి ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, కమిటీ సభ్యులు ఆదినారాయణ, ఆదిలక్ష్మి, రాజేష్, ధనరాజు, అప్పలరాజు, గంగిరి నూకరాజు, గనగళ్ల రామరాజు, ఆకుల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఐసీఈయూ పోరాటాలు స్ఫూర్తిదాయకం



మాట్లాడుతున్న శ్రీకాంత్ మిశ్రా

డాబాగార్డెన్స్: ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ 50వ స్వర్ణోత్సవ సర్వసభ్య సమావేశం ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. సమావేశానికి ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు, సౌత్ సెంట్రల్ జోన్ నుంచి జోనల్ నాయకులు, పలు డివిజన్ల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అసోసియేషన ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా మాట్లాడుతూ ఐసీఈయూ 50 ఏళ్ల పూర్తి చేసుకున్నందుకు, కొత్త భవనం సమకూర్చుకున్నందుకు, యూనియన్ నాయకత్వానికి, సభ్యులకు అభినందనలు తెలిపారు. 50 ఏళ్ల పూర్తి చేసుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. దేశాన్ని ప్రగతి పథంలో నడిపించడానికి దోహదపడే ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి, ప్రైవేటుపరం చేయడానికి ప్రస్తుత ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్న సమయంలో ఏఐఐఈఏ అందులో భాగమైన ఐసీఈయూ అనేక పోరాటాలు చేస్తూ, ఇన్సూరెన్స్ రంగంలోని ఎల్ఐసీని ప్రైవేట్ పరం చేయకుండా నిలువరించగలిగినట్లు తెలిపారు. ఈ ప్రస్థానంలో ఐసీఈయూ పాత్ర ఎంతో కీలకమన్నారు. జీవిత బీమా, ఆరోగ్య బీమా ప్రీమియంపై జీఎస్టీ ఎత్తివేయాలని ఏఐఐఈఏ చేస్తున్న పోరాటంలో భాగంగా కేవలం 22 రోజుల వ్యవధిలో సుమారు 400 మందికి పైగా ఎంపీలను కలిసి ప్రీమియంపై జీఎస్టీ వల్ల పాలసీదారులు ఎంతో నష్టపోతున్నారని వివరించడం ద్వారా విపక్ష నేతలు ఏకమై జీఎస్టీకి వ్యతిరేకంగా పార్లమెంట్‌లో గళమెత్తారన్నారు. యూనియన్ అధ్యక్షురాలు ఎం. కామేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జి. వరప్రసాద్, పెద్ద ఎత్తున యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత



విద్యార్థులతో డాక్టర్ జహీర్ అహ్మద్

డాబాగార్డెన్స్: పాతనగరంలో గల స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న ట్యూషన్ సెంటర్లో చదువుతున్న విద్యార్థులు కోలాటం, నృత్య ప్రదర్శనలో చక్కటి ప్రతిభ చూపుతున్నారు. అలాగే ప్రతి రోజూ వారి తల్లిదండ్రులకు పాదాభివందనం చేస్తున్నారు. ఆ సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్ ఆ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆదివారం సంస్థ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు బహుమతులు, పలువురు పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు చక్కగా పాటిస్తూ చక్కటి మార్గంలో నడిపిస్తున్న వివేకానంద సంస్థను, ట్యూషన్ పిల్లలను అభినందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు పైడిరాజు, అప్పలకొండ, ఉమాదేవి, కనకమహాలక్ష్మి, రాణి, సుజాత, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య యువజన సంఘం సేవలు నిరుపమానం



ఆకట్టుకున్న మహిళల నృత్యాలు

డాబాగార్డెన్స్: ఆర్యవైశ్య యువజన సంఘం 51వ వార్షికోత్సవం ఆదివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపాన గల వాసవీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు దుర్గా సోమేశ్వరరావు సంఘ ఆవిర్భావం గురించి వివరించారు. కార్యదర్శి కేఎస్ రామారావు వార్షిక నివేదిక అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న గ్రంధి విష్ణుమూర్తి మాట్లాడుతూ సుమారు 51 ఏళ్ల కిందట అప్పటి పెద్దలు ముందుచూపుతో ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య యువజన సంఘం నానాటికీ అభివృద్ధి చెందుతుందన్నారు. సంఘ ఆశయాలు ముందుకు తీసుకెళ్తూ ఎంతో మంది నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేసి, వారి ఉన్నత చదువులకు చేయూతనివ్వడం, పేద ఆర్యవైశ్య కుటుంబాలకు సహాయం, మహిళల ఆర్థిక స్వావలంబన చేకూరేలా కృషి చేయడం అభినందనీయమన్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పురుషులు, మహిళలు, పిల్లలకు వేర్వేరుగా ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రోగ్రామ్ చైర్మన్ పూసర్ల సురేష్‌కుమార్, డాక్టర్ పీవీఎస్ ఎస్వీ సాంబమూర్తి, ఆరిశెట్టి దినకర్, పెనుగొండ రామరాజు, దోమ వెంకట బాలాజీకుమార్, ఉప్పల భాస్కరరావు, విన్నకోట రామ్మూర్తి, కందుల మూర్తి, ఎలమర్తి గణేష్, కంకటాల శ్రీలక్ష్మి, చక్క చందన, నాళం శంకర్, కందుల సురేష్, పెనుగొండ చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చిత్రలేఖన పోటీలు



చిత్రలేఖన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

సీతంపేట : చిన్నారులు తమదైన శైలిలో అద్భుత చిత్రాలు గీసి అబ్బురపరిచారు. ఏబీయూ అకాడమీ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని సంస్థ కార్యాలయంలో విద్యార్థులకు ఆదివారం చిత్రలేఖన, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. 'సోషల్ మీడియా దుష్ప్రభావాలు' అనే అంశంపై పోటీ నిర్వహించారు. ఉదయం చిత్రలేఖనం, సాయంత్రం పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. తమ ఆలోచనలకు అద్దంపట్టేలా విద్యార్థులు అద్భుతమైన చిత్రాలు గీసి అబ్బురపరిచారు. అనంతరం పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సంస్థ వ్యవస్థాపకురాలు ఎస్.ఉషారాణి పర్యవేక్షించారు.

విశ్రాంత ఉద్యోగులకు ఆరోగ్య బీమా



సమావేశంలో విశ్రాంత బ్యాంకు ఉద్యోగులు

సీతంపేట : ఆంధ్రా బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య విశాఖపట్నం విభాగం సమావేశం ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. బ్యాంకు విశ్రాంత ఉద్యోగులకు తక్కువ ప్రీమియంతో రూపొందించిన ఆరోగ్య బీమా పథకాన్ని కంపెనీ ప్రతినిధి నరసింహమూర్తి వివరించారు. సమాఖ్య తరపున ప్రతి నెలా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొని అవసరమైన వారికి విద్య, ఆరోగ్య, ఆహార, ధన రూపేణ వీలైనంత సాయం చేయాలని సభ్యులు నిర్ణయించారు. సమాఖ్య సహాయ కార్యదర్శి టంకాల కామేశ్వరరావు, సూర్య భాస్కర్, కేశవరావు, కృష్ణారావు, రవికుమార్ పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో మహా అన్నసమారాధన



అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రవి భవానీ దంపతులు



అలంకరణలో దుర్గమ్మ

అల్లిపురం: స్థానిక మెయిన్‌రోడ్డులో శ్రీ ధనశక్తి దుర్గాదేవి పీఠం ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ నుంచి దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా ఆదివారం మహా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠం నిర్వాహకుడు రవి భవానీ మాట్లాడుతూ ప్రతి ఏడాది అమ్మవారి ఉత్సవాలు 18 రోజుల పాటు నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. ఈ నెల 23వ తేదీన అమ్మవారి అనుపు మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు ఆ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి వాణి విని తరించాలని కోరారు.

రహదారికి అడ్డంగా పశువుల సంచారం



ఏయూ అవుట్ గేట్ ప్రాంతంలో రోడ్డుకు అడ్డంగా సంచరిస్తున్న పశువులు

ఏయూక్యాంపస్: రహదారికి అడ్డంగా పశువుల సంచారం ఇబ్బందులకు గురి చేస్తోంది. ఏయూ అవుట్ గేట్ ప్రాంతంలో నిత్యం పదుల సంఖ్యలో పశువులు సంచరిస్తుంటాయి. కిర్లంపూడి, బీచ్ రోడ్డు ప్రాంతంలో ఇవి రోడ్లపై పడుకుని వాహన చోదకులకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. కొన్ని సందర్భాల్లో పశువులు ఒకదానినొకటి పొడుచుకోవడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. పశు వ్యర్థాలతో రహదారులు సైతం అధ్వానంగా తయారవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. కొన్ని సమయాలలో వాహన ప్రమాదాలకు సైతం ఇవి కారణంగా మారుతున్నాయి. ఇటీవల బీచ్ రోడ్డులో ఒక గేదెను కారు గుద్దడంతో తీవ్రంగా గాయపడింది. ప్రమాదాలు జరుగుతున్నా.. పెంపకం దారులు మాత్రం పశువులను రోడ్లపైకి యథేచ్ఛగా వదిలేస్తున్నారు.

శిథిలావస్థలో తెన్నేటి పార్కు మెట్లమార్గం



తెన్నేటి పార్కు నుంచి బీచ్‌కు వెళ్లే మార్గంలో శిథిలమైన మెట్లు

ఆరిలోవ: పర్యాటక ప్రాంతం తెన్నేటి పార్కు నుంచి బీచ్‌కు వెళ్లే మెట్ల మార్గం శిథిలమైంది. ఈ పార్కు నుంచి బీచ్ వైపు దిగడానికి వీలుగా గతంలో వీఎంఆర్‌డీఏ మెట్ల మార్గం ఏర్పాటు చేసింది. వాటిపై నుంచి బీచ్‌లోకి సందర్శకులు దిగుతుంటారు. ఈ మెట్ల పక్కనే పిల్లలు సరదాగా కిందకు దిగడానికి వారి కోసం ప్రత్యేకంగా మార్గం నిర్మించి. ఆర్చ్ ఆకారంలో ఏర్పాటు చేసిన ఈ మార్గంలో కొన్ని మెట్లు ఎక్కిన తర్వాత జారుతూ పిల్లలు కిందకు దిగవచ్చు. ఈ మెట్ల మార్గంలో దిగడానికి పిల్లలు ఆసక్తి చూపేవారు. ఇప్పుడు ఈ మెట్లు శిథిలమయ్యాయి. దీంతో పిల్లలు వాటిని వినియోగించడానికి వీలుపడటం లేదు. మెట్లకు ఇరుపక్కలా చిన్న ఎత్తులో ఉన్న రక్షణ గోడలు విరిగిపోయాయి. జారుడు బల్లలాంటి భాగం శిథిలమైంది. వీఎంఆర్‌డీఏ అధికారులు ఈ పార్కును ఇటీవల ఆధునికీకరించారు. కొన్ని రూ.లక్షలు ఖర్చు చేసి పార్కును ఆధునీకరించిన అధికారులు రూ.వేలల్లో ఖర్చు అయ్యే ఇక్కడ బీచ్‌లోకి దిగే మెట్లను మాత్రం మరిచిపోవడం విశేషం. వీఎంఆర్‌డీఏ అధికారులు స్పందించి పిల్లల కోసం మెట్ల మార్గాన్ని పునర్నిర్మించాలని సందర్శకులు కోరుతున్నారు.

అక్రమ ఆశీలు దందా

- చిరు వ్యాపారులను దోచుకుంటున్న కాంట్రాక్టర్లు
- పండగల సమయంలో మరింత దారుణం
- గెజిట్ రేట్లు వసూలు చేయాలని పూర్ణామార్కెట్ వ్యాపారుల వేడుకోలు



దుకాణాల వద్ద రద్దీ



పూర్ణామార్కెట్ వద్ద దుకాణాలు

జగదాంబ: పూర్ణామార్కెట్‌లో అక్రమ ఆశీలు దందా సాగుతోందని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ జోన్-4 పరిధిలో పెద్ద మార్కెట్ అయిన పూర్ణామార్కెట్ ఆశీలు పాట ఈ ఏడాది ఎన్నికల కారణంగా వాయిదా పడడంతో ఆలస్యంగా నిర్వహించారు. తర్వాత కాంట్రాక్టర్లు పాటను దక్కించుకుని చిరు వ్యాపారులపై పడ్డారని చెబుతున్నారు. వాస్తవంగా జీవీఎంసీ గెజిట్ ధరల ప్రకారం పూర్ణామార్కెట్‌లో ఒక జంగిడీ పెట్టుకుని వ్యాపారం చేసుకునే వారికి జంగిడీకి రూ. 10, ద్విచక్ర వాహనానికి రూ.5, నాలుగు చక్రాల వాహనాలకు రూ. 20 వరకు వసూలు చేయాల్సి ఉంది. కానీ కాంట్రాక్టర్లు జంగిడీకి రూ. 150 నుంచి రూ. 300 వరకు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల దసరా సమయంలో రూ. 500కు పైగా వసూలు చేశారని వ్యాపారులు చెబుతున్నారు. అలాగే పార్కింగ్ ధరలు కూడా అత్యధికంగా వసూలు చేస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. మార్కెట్‌కు వస్తే సరకుల కొనుగోలు కంటే ఆశీలుకే ఎక్కువ డబ్బులు చెల్లించాల్సి వస్తుందని వాపోతున్నారు.

పరిధికి మించి...

కార్పొరేషన్ గెజిట్‌తో పాటు ఆశీలు వసూల్‌కు జీవీఎంసీ పరిధులు పెట్టింది. మార్కెట్‌లో ఏబీసీడీ కేటగిరీల కింద 750 దుకాణాలు ఉంటే మరో 750కి పైగా దుకాణాలు మార్కెట్ చుట్టూ ఉన్నాయి. ఇలా పదిహేను వందలకు పైగా దుకాణాలతో పాటు మార్కెట్ నుంచి ఉత్తర, దక్షణ, పడమర, తూర్పు దిక్కులకు పరిధిని ఏర్పాటు చేసి ఆశీలు పాట నిర్వహించారు. కానీ కాంట్రాక్టర్లు టర్నర్ చౌల్ట్రీ నుంచి టౌన్ కొత్తరోడ్డు వరకు వ్యాపారుల వద్ద ఆశీలు వసూల్ చేస్తున్నారు. వాహనాల ఆశీలు అయితే మరింత దారుణంగా ఉంది. పూర్ణామార్కెట్‌కు సరకులతో వచ్చే వాహనాలకు రూ. 250 నుంచి రూ. 500 వరకు ఆశీలు వసూలు చేస్తున్నారంటే అతిశయోక్తిలేదు. ఇళ్ల నిర్మాణాల కోసం ఇసుక, సిమెంట్, పిక్క తీసుకొచ్చే లారీల నుండి కూడా ఎక్కువ మొత్తంలో ముక్కు పిండి వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

రిజిస్ట్రేషన్ లేదు..

జీవీఎంసీ నిర్వహించిన ఆశీలు పాట దక్కించుకున్న వ్యాపారులు బ్యాంక్ గ్యారెంటీ, రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలి. అయితే కొందరు కాంట్రాక్టర్లు ఇవేవీ లేకుండానే నిబంధనలు పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా ఆశీలు వసూలు చేస్తున్నారు. జీవీఎంసీ కౌన్సిల్‌లో నిబంధనల ప్రకారం బ్యాంక్ గ్యారెంటీ, రిజిస్ట్రేషన్ అయిన కాంట్రాక్టర్లకే ప్రొసీడింగ్ ఆర్డర్లు ఇవ్వాల్సి ఉంది. కాని కార్యాలయంలో ఓ గుమస్తా అత్యుత్సాహం చూపించి ప్రొసీడింగ్‌లు ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. నిబంధనలు పక్కన పెట్టి వ్యవహారం సాగిస్తున్నారనే ఆరోపణలు వినబడుతున్నాయి.

చర్యలు తీసుకుంటాం..



బ్యాంగ్ గ్యారెంటీ, రిజిస్ట్రేషన్లు తప్పనిసరిగా ఉండాల్సిందే. ఇందు లో ఎవరికీ ఎటువంటి మినహాయింపు లేదు. ధరలు గెజిట్ ప్రకారం వసూలు చేయాలి. లేని పక్షంలో చర్యలు తప్ప వు.

–ఎం.మల్లయ్యనాయుడు, జీవీఎంసీ జోన్–4 కమిషనర్ సూర్యాబాగ్

పొంగిపొర్లుతున్న యూజీడీలు



కిర్లంపూడి లేఅవుట్‌లో యూజీడీ మ్యాన్ హోల్ లీకై రోడ్డెక్కిన మురుగు

మద్దిలపాలెం: పలు ప్రాంతాల్లో యూజీడీ మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లుతున్నాయి. జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలో మ్యాన్ హోళ్లు లీకై మురుగు నీరు రోడ్డెక్కి ప్రవహిస్తోంది. మురుగు దుర్వాసనతో నివాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య నిత్యం ఉన్నా.. యూజీడీ విభాగం సిబ్బంది పట్టించుకోడం లేదని స్థానికులు చెబుతున్నారు. మురుగు నీరు రోడ్డుపైకి రావడంతో రాకపోకలు సాగించలేకపోతున్నామని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

రహదారిపై మురుగు ప్రవాహం

ఏయూక్యాంపస్: కిర్లంపూడి లేఅవుట్‌లోని అంబికా సీ గ్రీన్‌కు చేరువలో జీవీఎంసీ భవనం సమీపాన యూజీడీ మ్యాన్‌హోల్ నుంచి మురుగు నీరు ఉబికి వస్తోంది. ఇది బీచ్ రోడ్డు వైపు ప్రవహిస్తోంది. దీంతో ఈ మార్గంలో నడవాలంటేనే ఇబ్బందికరంగా మారింది. వర్షం కురిసిన సందర్భంలో ఇక్కడ ఇదే పరిస్థితి. సాధారణ రోజుల్లో కూడా ఇక్కడ నుంచి వ్యర్థ జలాలు బయటకు వస్తున్నాయి. తరచూ ఈ ప్రాంతంలో యూజీడీ లీకేజీ సమస్య తలెత్తుతోంది.